

కొంపెల్ల - సూర్యారావు

మా రాముడు వేపుకుతిన్నాడు. తీరా వస్తానని మాటిచ్చేను గదా అని వెళ్ళేను ఆ రాత్రి; ఫుట్టేక నేనెప్పుడూ భోగం మేళా లేమిటో మేజువాణీ లేమిటో ఎరగను. తీరా వెళ్ళేదాకా వుండి మా రాము డెక్కడ కనపడ్డు. ఒచ్చి కూర్చో మనేవాడు లేడు. ఓ స్తంభంప్రక్క క్రీనీడలో నిలబడ్డాను. భోగంవాళ్ళవళ్ళూ మనరాక చూళ్ళేదు. అదో పెద్ద సుగుణం. రాముడు ఎప్పు డొస్తాడా ఎప్పుడు 'ఒహో! ఇల్లా దయ చెయ్యరా!' అని ఆహ్వానిస్తాడా అని చూసి చూసి ప్రాణం విసిగింది. ఇక్కడ నించుంటే ఎప్పటికైనా సానులు చూడ్డం తటస్థిస్తుంది. మనం ఆక్రీనీడలో నక్కడం చూసిన మీదట మనవా డొచ్చి ఎంత గౌరవంగా ఆహ్వానించినా వాళ్ళకి నవ్వుతాలుగానే వుంటుందని గప్‌చిప్‌గా పందిట్లోంచి జారిపోయి దూరంగా రోడ్డుమీద నిలబడ్డాను. మా రాముడు ఎక్కణ్ణించో ఒస్తున్నాడు. నన్ను చూచి 'ఒహో' అనడం, కౌగలించుకోడం, అపరిమితంగా సంతోషించడం అన్నీ జరిగేయి. ఎందుకు? ఇవన్నీ రోడ్డుమీద. ఈపనే పందిట్లో జరిగితే అదెంత అందం! ఇంకో నిమిషం పందిట్లోనే నేను నిలబడివుంటే ఒగిలిపోవును. అంతా కలిసి పందిట్లో కెళ్ళేం—కాని ఆదారి వేరు—ముందు కూర్చోపెట్టబోతే స్వేచ్ఛకి భంగం ఒస్తుందని కాస్త వెనక్కి జేరేను. మా రాముడు నాపక్క కూర్చున్నాడు. ఒక గంట సేపు పరకాయించేం, ఆట పాటాను. అందులో ఒక్క స్త్రీ మనకేసి చూసిన జాడలేదు. ఎదుట కూర్చున్న కుర్రాళ్ళమీద బలేకోపం వచ్చింది. చదువు సంధ్యలు తక్కువైనా వేషా లెక్కువ.

"ఒరే! ఆ ఆడది ఫిల్ముకంపెనీకి తయారౌతా నంటోంది పనికొస్తుందేమో చూడు" అన్నాడు రాముడు.

"కట్, నచ్చలేదురా. కళ్ళు బొత్తిగా చిన్నవి. లాభం లేదు" అన్నాను. "ఇంకా నిల బడ్డ వాళ్ళలో రెండోది నయం" అన్నాను.

"నీకు నచ్చిందా?" అన్నాడు. "పరవా లేదు, నచ్చింది" అన్నాను.

"నీ పక్కని హీరోయిన్ వేయిస్తే నీ కిష్టమే?" అన్నాడు.

"నారదుడు పెళ్లాం వేషం వేయిస్తావేమిటి?" అన్నాను.

"అందికే!" అన్నాడు.

ఆపదం ఆఖరయేక "రాముడూ! నారదుడి పెళ్లాంచేత ఓపాట పాడించరా" అన్నాను.

అందరూ గొల్లుమని నాకేసి చూసేరు. అంతవరకు నారదుడు, పెళ్లాంకేసి చూడ్డమే కాని నారదుడు పెళ్లాం నారదుడు కేసి చూడ లేదు. నారదుడంటూ ఒకడున్నాడనే తెలియ నట్టు కనిపించింది దాని వైఖరి చూడగా. "నారదుడి పెళ్లాంచేత పాడించరా" అనడంతో అందరూ గొల్లుమని నా కేసి చూడ్డంతో నార దుడి పెళ్లాంకూడా నారదుడి కేసి చూసింది, కాని నారదుణ్ణి ఆనవాలు కట్టినట్టు లేదు. "ఏమిటి, ఏమిటి!" అన్నారు ఎవళ్లో రాము డితో. "ఆ నించున్న వాళ్ళలో రెండో పిల్లచేత ఓపాట పాడించు" అని సవరించుకున్నాను. ఇంకో ఇద్దరు కుర్రాళ్ళు వొచ్చేసేరు. రాముడు దాన్ని ఓ నాటకం పాట ఏదేనా పాడు" అన్నాడు. "నాకు రావండి" అంది. "పోనీ ఒక హిందూస్తానీ పాటేనా సరే" అన్నాడు. "నాకు రావండి" అంది. "పోనీ ఓకృతి— ఏదేనా" అన్నాడు. "నాకు కృతులు రావండి" అంది. నేనే జాలిపడి—జాలిపడ్డమేమిటి, ఎంత పాట రాకపోయినా నారదుడి పెళ్లాం అయేక చిన్నబుచ్చకూడదని—"పోనీ ఆ మూడో పిల్ల చేత పాడించరా" అన్నాను. ఆ పిల్ల ముందు కొచ్చి హిందూస్తానీ పాటొకటి మొదలెట్టింది. నారదుడు ఈ డెల్టా లోకంలో అట్టే సంచ రించేవాడు కాకపోవడంచేత ఆ పాట నారదుడి కెల్లాగో వుంది.

"రాముడూ! పోయి ఒకప్పు టీయేనా తా గక ఎందుకు?" అన్నాను. లేచేం; నారదుడి పెళ్ళాం నారదుడి కేసి చూస్తోనే వుంది. బయ టికి పోయేం.

టీ తాగుతూ రాముడన్నాడు: "ఒగే అ ద్భుతంగా పాడే నారదుడికి పాట రాని పెళ్ళాం దొరికిందేమిట్రా!" అన్నాడు.

నే నన్నాను: "లేనిది తెచ్చిపడితే ఇంత కంటె యెక్కువ ఏడుస్తుందా? నారదుడికి పెళ్ళాం ఎంత నిజమో, పెళ్ళానికి పాటా అంతే!!!"

మీకు కావలసిన చక్కని స్వదేశీ సిల్కు యుడుపులు, గుడ్డలు పలువిధములైన చీరలు, జాకెట్లు రకములును,

కేశవరామ్ అండు కంపెని,

1/287, ఎస్ప్లనేడ్ రోడ్డు, మద్రాసులో దొరకును.